క్లుప్తంగా

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు



చలివేంద్రం ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ ప్రసాద్

మునగపాక: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మండల సముదాయాలకు పలు పనులపై వచ్చేవారికి అందుబాటులో ఈ చలివేంద్రం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, కర్రి ఉస్తేల్ నాయుడు, ఎస్. రాము తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాలు



వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తుడు శివ

మునగపాక: ప్రతి ఒక్కరూ వెంకన్న ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. స్థానిక బైపాస్ రోడ్డులో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పలువురు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. శనివారం మునగపాకకు చెందిన మళ్ల శివ రూ.50 వేలు విరాళంగా అందజేశారు. సూరిశెట్టి గోవింద రూ.5,116 అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, దిమ్మల అప్పారావు, ఆడారి రాజు, పెంటకోట సత్యనారాయణ, ఆడారి కాశీబాబు, పెంటకోట నాయుడు, ఆడారి గోవింద, విల్లూరి నూక నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు ఒప్పందం



ఎంవోయూ పత్రాలు పరస్పరం మార్చుకుంటున్న దృశ్యం

అచ్యుతాపురం: యువత నైపుణ్య శిక్షణకు సంబంధించి స్థానిక ప్రశాంతి పాలిటెక్నికల్ కళాశాల యాజమాన్యం భువనేశ్వర్‌లోని సీవీ రామన్ గ్లోబల్ యూనివర్సిటీతో ఎంవోయూ కుదుర్చుకుంది. బజాజ్ ఆటో లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో కళాశాల సిఫారసు చేసిన విద్యార్థులకు నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం బజాజ్ కంపెనీలో ఉద్యోగాలు ఇవ్వనున్నారు. పరస్పర అవగాహన మేరకు ఎంవోయూ చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

52 మందికి నేత్ర వైద్య పరీక్షలు



మెలిపాకలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని మెలిపాకలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. విశాఖ ఐ ఆస్పత్రి సౌజన్యంతో బీసీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి 52 మంది రోగులు హాజరుకాగా, వారిలో ఐదుగురికి శస్త్ర చికిత్సలు చేసేందుకు నిర్ణయించారు. శిబిరానికి సాయికృష్ణ, వనభాక్షి, మహేష్ తదితరులు సేవలందించారు. కార్యక్రమంలో వైఏస్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

200 పీఎండీఎస్ కిట్‌ల తయారీ



తయారు చేసిన కిట్స్‌తో ప్రకృతి సిబ్బంది

చీడికాడ : రైతులకు అందించేందుకు 200 పీఎండీఎస్ కిట్‌లను తయారు చేసినట్టు బైలపూడి సర్పంచ్ గంగతల్లి తెలిపారు. శనివారం వారు సచివాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కూడి 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ కిట్‌లు తయారు చేశారు. ఈ తొలకరిలో వీటిని ఖరీఫ్ సాగుకు ముందు పొలాల్లో చల్లి పచ్చి రొట్ట ఎరువుగా వినియోగించనున్నట్టు తెలిపారు.

ప్రమాదపుటంచున ఆవ బ్రిడ్జి

- శిథిలమై కూలేందుకు సిద్ధం
- వాహన చోదకులు బెంబేలు



శిథిలావస్థకు చేరుకున్న గోపాలపట్నం ఆవ బ్రిడ్జి

పాయకరావుపేట: దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి అది... పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఏక్షణంలో కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దానిపై రాకపోకలు సాగించాలంటే వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. మండలంలో గోపాలపట్నం ఆవపై బ్రిడ్జి శిథిలమై ప్రమాదపుటంచున ఉంది. పాయకరావుపేట నుంచి నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెనపై ప్రయాణాలు సాగిస్తుంటాయి. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సుమారు 55 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టలేదు. కొత్తగా బ్రిడ్జి నిర్మించిన పాపాన పోలేదు.

రాత్రిళ్లు అజాగ్రత్తగా నడిపితే ప్రాణాపాయం..

ఈ బ్రిడ్జిపై పెద్దిరాజుపాలెం, గోపాలపట్నం, పెంటకోట, తీరప్రాంతం, నక్కపల్లి మండలంలో బంగారయ్యపేట, గునుపూడి, డీఎల్‌పురం గ్రామాలకు వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. తీర ప్రాంతంలో ఉండే ప్రజలకు సంబంధించిన వాహనాలు, చుట్టు పక్కల గ్రామాల రైతులు పొలాలకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు నిత్యం ప్రయాణం సాగిస్తుంటాయి. ఈ బ్రిడ్జి శిథిలమైపోవడంతోపాటు ఇరువైపులా రైలింగ్ విరిగిపోవడంతో వాహన చోదకులకు రక్షణ కరువైంది. దాంతో భయభ్రాంతలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో వాహనాలు నడిపేవారు ఏమాత్రం అజాగ్రత్త వహించినా సరే, బ్రిడ్జిపై నుంచి కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామ ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఈ విషయమై రోడ్లు, భవనాల శాఖ మండల ఏఈని సంప్రదించగా, గోపాలపట్నం ఆవపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి గతంలోనే ఐదు కోట్ల రూపాయలకుపైగా ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే, నూతన బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు.

నూతనంగా బ్రిడ్జి నిర్మించాలి



ఆవపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ఇది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇరువైపులా రైలింగ్ పూర్తిగా విరిగిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి నూతనంగా బ్రిడ్జి నిర్మించాలి.

-పన్నీరు బాబ్జి, సర్పంచ్, గోపాలపట్నం

వేళాపాళా లేని వ్యవసాయ విద్యుత్



గణపర్తిలోని ట్రాన్స్‌ఫార్మర్

మునగపాక: మండలంలోని గణపర్తిలో కొంత కాలంగా వేళాపాళా లేకుండా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ 9 గంటల పాటు సరఫరా చేయడం లేదంటూ రైతులు వాపోతున్నారు. ఒక వైపు ఎండల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, దీనివల్ల నష్టాలు చవి చూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్ సరఫరా అరకొరగా ఉందంటూ మాజీ సర్పంచ్ కర్రి రామనాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఆ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్లు 12, 15 కొంతకాలంగా పనిచేయకపోవడంతో రోజూ ట్రిప్ అవుతుందని సంబంధిత సిబ్బంది చెబుతున్నారే గాని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదంటూ రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

వెంకన్న ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న దృశ్యం

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు రేజేటి సత్యనారాయణ మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. మన గుడి గోపురం (బ్రహ్మ కపాలం మూత) కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి ఒక్కరూ ధాన్యం తీసుకువచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, కమిటీ సభ్యులు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, దాడి ముసిలినాయుడు, విల్లూరి నూక నరసింగరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు, పొలిమేర గణేష్, అలంక ప్రకాష్‌రావు, వెలగా శ్రీనివాసరావు, ఆడారి అచ్చియ్యనాయుడు, ఆడారి కాశీబాబు, కోనపల్లి రామ్మోహనరావు, కాండ్రేగుల జగ్గారావు, మళ్ల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తోడపెద్దు అచ్చుపోత



తోడపెద్దును దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



ఆకట్టుకున్న సేవగరిడి

మునగపాక: మండలంలోని నారాయుడుపాలెంలో శనివారం తోడపెద్దు అచ్చుపోత కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు గ్రామాలకు చెందిన సేవ గరిడీలు అచ్చుపోతలో పాల్గొన్నాయి. తోడపెద్దులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. తోడపెద్దు గుడిలో ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సేవ గరిడి కళాకారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అచ్చుపోత పోసుకున్న తోడపెద్దును పూజించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారుకొండ వెంకటి రాజు, కొయ్య శేషు, చక్రంతోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భారీగా ప్రజలు తరలివచ్చారు.

బురదమయంగా పీహెచ్‌సీ రోడ్డు



పీహెచ్‌సీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఎస్.రాయవరం: పెనుగొల్లు పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో వర్షపునీరు, స్థానిక నివాసాల నుంచి వచ్చిన మురుగు నిలిచిపోయి బురదమయంగా మారుతోంది. నిత్యం వందల సంఖ్యలో పీహెచ్‌సీకి వచ్చి వెళ్లే రోగులు, సిబ్బంది, గర్భిణులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఆనుకుని భవనాలు నిర్మించుకున్న వారు డ్రైనేజీ ఏర్పాటు చేయలేదు. పైగా వర్షపు నీరు దిగువకు పోనివ్వకుండా ఎత్తుగా భవన నిర్మాణాలు చేపట్టడం వల్ల ఈ సమస్య తలెత్తుతోంది. సుమారు 20 గ్రామాలకు చెందిన రోగులతోపాటు సిబ్బంది రాకపోకల సమయంలో ఇబ్బంది పడుతున్నారు. వెంటనే పీహెచ్‌సీ రోడ్డుపై మురుగు పోయేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

అచ్యుతాపురం రూరల్: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, దిబ్బపాలెం, భోగాపురం, అచ్యుతాపురం, మోసయ్యపేట, మార్టూరు, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురంరోడ్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా ఉండబోదన్నారు.

అనుమానాస్పద మహిళల పట్ల అప్రమత్తం



మునగపాకలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళలు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో కొంతమంది మహిళలు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. గుంపులుగా వచ్చి ఇళ్లలోకి చొరబడి వస్తువులను ఎత్తుకుపోతున్నారంటూ ప్రచారం జరగడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఎక్కడ నుంచో పొట్టకూటి కోసం వచ్చిన మహిళలు దొంగతనాలకు పాల్పడుతున్నారంటూ వాపోతున్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ దొంగతనాలకు పాల్పడే వారిని పోలీసులకు అప్పగించాలని గ్రామపెద్దలు కోరుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా గ్రామంలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ ప్రసాదరావు కోరుతున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



కోటవురట్ల గ్రంథాలయంలో చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



అచ్యుతాపురం గ్రంథాలయంలో కరాటేపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన శిబిరంలో గ్రంథాలయాల ప్రాముఖ్యతను గ్రంథాలయాధికారి అప్పలనాయుడు వివరించారు. విద్యార్థులు గ్రంథాలయ సందర్శన ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నా రు. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు విజ్ఞానానికి సంబంధించిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

కరాటేపై శిక్షణ

అచ్యుతాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం యువతకు కరాటేపై శిక్షణతోపాటు, అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ వ్యవహరించిన జి.సన్యాసినాయుడు కరాటేలో పాటించాల్సిన మెలకువలను నేర్పారు. ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కరాటే ద్వారా బాక్సింగ్‌లోకి అడుగు పెట్టవచ్చని సూచించారు. నేటితరంలో మహిళలు కూడా స్వీయ రక్షణకు కరాటేలో శిక్షణ పొందవచ్చన్నారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, పాల్గొన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా కరాటేపై అవగాహన కల్పించారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



అప్పన్నకు యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అలరించిన జముకుల బృంద గానం



జముకుల బృందం ఆలపిస్తున్న అమ్మవారి చరిత్రపై గానం

కోటవురట్ల: స్థానిక గవరపేటలో వెలసిన దేవతమ్మ ఆలయం వద్ద శనివారం జముకుల బృంద గానం ఆహూతులను అలరించింది. దేవతమ్మ ఉత్సవాల్లో భాగంగా మాకవరపాలెం మండలం నాయుడుపాలెంకు చెందిన కల్యాణ పోతురాజుతోపాటు నలుగురు సభ్యుల బృందం జముకులను చేతులతో వినసొంపుగా వాయిస్తూ దేవతమ్మ చరిత్ర పాట ఆలపించారు. ఇది ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ ఏటా జిల్లాలోని పలు గ్రామాల్లో జరిగే పదికిపైగా దేవతమ్మ ఉత్సవాల్లో పాల్గొంటామన్నారు. సంప్రదాయంగా పుట్టుక రోజు మొదలు, పండగ ముగిసే వరకు అమ్మవారి చరిత్ర ఘట్టాలను పాట రూపంలో గానం చేస్తూ ఉత్సవ నిర్వహణలో పాలు పంచుకుంటామన్నారు. ఉత్సవాల రోజుల్లో వచ్చే ఆదాయంతోపాటు సాధారణ రోజుల్లో వ్యవసాయం చేస్తూ, కూలీ పనులకు వెళ్లి కుటుంబ జీవనం సాగిస్తుంటామన్నారు. సుమారు 15 ఏళ్లగా ఉత్సవాల్లో గానం చేస్తున్నామన్నారు.

సైనికోద్యోగుల కుటుంబాలకు సత్కారం



సైనికోద్యోగుల కుటుంబాలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్

యలమంచిలి రూరల్: దేశ భూభాగం, ఆస్తులు, ప్రజల రక్షణ అంతా త్రివిధ దళాల్లో పనిచేస్తున్న సైనికోద్యోగుల చేతుల్లోనే ఉందని, వారి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి తెలిపారు. శనివారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో నివాసముంటూ రక్షణ దళంలో పనిచేస్తున్న ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. మొత్తం 283 మంది త్రివిధ దళాలకు చెందిన ఉద్యోగులున్నట్టు గుర్తించిన అధికారులు 6 బృందాలుగా ఏర్పడి వారిని సత్కరించారు. సైనికోద్యోగుల ఇళ్లకు జాతీయ జెండాను ఉంచి, తమ మద్దతు తెలిపారు. అంతకుముందు పట్టణ పరిధిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి



ఉత్తమ రైతులను సత్కరిస్తున్న దృశ్యం

కోటవురట్ల: మండలంలోని విసన్నపేటలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ ప్రణాళికపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 రకాల నవ ధాన్యాలు సాగు చేయాలని, దానివల్ల భూమి సారవంతమవుతుందని, ఆరోగ్యకరంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. దీనివల్ల పెట్టుబడి వ్యయం తగ్గుతుందని, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండుతాయన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారిలో ఉత్తమ రైతులు సత్యారావు, ఆవాల అప్పారావు, మండే వరలక్ష్మి, గొల్లవిల్లి అప్పారావులను ఎంపిక చేసి సత్కరించారు. సర్పంచ్ ఉప్పనూరి మాణిక్యం, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పనూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



బీకే పల్లిలో మానవహారంగా ఏర్పడ్డ అధికారులు



కె.వెంకటాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు



అరబుపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ శ్రీను, సచివాలయ ఉద్యోగులు



మునగపాక మెయిన్‌రోడ్డులో ప్రచారం నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ ప్రసాద్



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, సిబ్బంది

పాయకరావుపేట: గ్రామాల్లో ఇళ్ల వద్ద, రోడ్లపై పరిశుభ్రత కలిగి ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో కె.జయప్రకాష్‌రావు తెలిపారు. స్వచ్ఛ భారత్ - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా పట్టణంలో చెక్కనగర్‌లో నాయకులు, సచివాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చేపట్టారు.

కోటవురట్ల: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని పొందవచ్చని ఈవోపీఆర్డీ రఘురాం తెలిపారు. మండలంలో కె.వెంకటాపురం, బి.కె.పల్లి గ్రామాల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేసి స్థానికులకు అవగాహన కల్పించారు. బి.కె.పల్లిలో ర్యాలీ చేసి మానవహారం ఏర్పాడ్డారు. వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రతపై నినాదాలు చేశారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ మన ఇంటితో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తరచుగా చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా అనారోగ్యం దరి చేరదన్నారు. స్వచ్ఛ గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగన్న నాయుడు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కె.వెంకటాపురం సచివాలయం వద్ద స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కోసం ప్రతిజ్ఞ చేశారు. ఇక్కడ అధికారులతో పాటు గ్రామస్తులు పైల నాని, తిరుమలరావు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. మునగపాక మెయిన్‌రోడ్డులో మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాలు సస్యశ్యామలంగా తయారు కావాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. మునగపాక సంపద తయారీ కేంద్రం వద్ద సర్పంచ్ దిమ్మల అప్పారావు, అరబుపాలెంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ కూలీలతో కలిసి ప్రతి ఒక్కరూ స్వచ్ఛాంధ్రలో భాగస్వాములమవుతామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

నాణ్యతలో రాజీ వద్దు



స్టోర్స్‌లో ప్రసాదాల ముడిసరుకును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఈవో సుజాత

సింహాచలం: ప్రసాదాలు, అన్నప్రసాదానికి వినియోగించే సరుకుల నాణ్యతని అధికారులు, స్టోర్స్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించాలని సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో ఎస్.సుజాత సూచించారు. సింహగిరిపై ఉన్న స్టోర్స్‌ని శనివారం ఆమె సందర్శించారు. ముడి సరుకులను పరిశీలించారు. సాంపిల్స్ ఎప్పటికప్పుడు టెస్టింగ్‌కి వెళ్తున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీశాలను పరిశీలించిన ఆమె లడ్డూ, పులిహోర తయారు చేసే సిబ్బందితో మాట్లాడారు. నాణ్యంగా ప్రసాదాలు తయారు చేయాలని సూచించారు. అన్నప్రసాదాన్ని పరిశీలించిన ఆమె భక్తులు సంతృప్తి చెందేలా అన్నప్రసాదం తయారు చేయాలని సూచించారు. స్టోర్స్ ఏఈవో పిల్లా శ్రీనివాసరావు, ఉద్యోగులు ఆమె వెంట ఉన్నారు.